క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్: హబ్సిగూడ ఐఐసిటీ, సీసీఎంబీ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హబ్సిగూడ ట్రాన్స్‌కో ఏఈ తెలిపారు. వీఎస్‌టీ కాలనీ, భవానీనగర్, రాజీవ్‌నగర్, శ్రీనగర్ కాలనీ, హెచ్‌ఎంటీ నగర్ వీధి నంబర్-1, నాచారం మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ ఐఎస్‌ఐ ఫీడర్ మరమ్మతుల కారణంగా హబ్సిగూడ వీధి నంబర్-8లోని వీవీ నగర్, గ్రీన్‌హిల్స్ కాలనీ, గాంధీ గిరిజన బస్తీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

జీపుజాత పోస్టర్ ఆవిష్కరణ



మల్కాజిగిరి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కంచాలని కోరుతూ 16వ తేదీ నుంచి జీపుజాత ప్రారంభమవుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి శోభారాణి తెలిపారు. బుధవారం జీపుజాత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయన్నారు. వచ్చే నెల 10 వరకు జాత జరుగుతుందన్నారు. ఆల్ ఇండియా యూనియన్ పిలుపులో భాగంగా 9 నుంచి 13 వరకు సర్వే, 15న సీడీపీవోలకు వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నిక్రిష్ణన్, రాణి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మరకత లక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు



అల్వాల్: కానాజీగూడలోని లక్ష్మీ గణపతి ఆలయంలో వెలసిన ప్రపంచంలోనే అరుదైన అత్యంత విశిష్టమైన మరకతముచే మల్చబడిన శ్రీలక్ష్మీ గణపతి స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించామని నిర్వాహకులు మోత్కూరు సత్యనారాయణ శాస్త్రీ తెలిపారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద దాతలకు వేద ఆశీర్వచనం ప్రసాదాలు అందజేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పీవీఎస్ కాలనీలో రూ.17 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ యూజీడీ, తాగునీటి పైపులైన్ల పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, సంపత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ వెలుగుగుట్ట, స్వయంభు వెలసిన మేరామమాయి దేవాలయ కమిటీ ధర్మకర్తలు అమర్‌సింగ్ తిలావత్, రామావత్ రాములునాయక్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని నియమించారు. కమిటీ గౌరవ చైర్మన్‌గా అమర్‌సింగ్ తిలావత్, రామావత్ రాములునాయక్, వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా బానోత్ గోవర్ధన్‌నాయక్, వైస్ చైర్మన్‌గా తేజావత్ గణేష్‌నాయక్, ధానావత్ ధర్మినాయక్, ప్రధాన కార్యదర్శిగా బనోత్ సంధ్యారాణి, ట్రెజరర్‌గా లావూరి రమేష్‌నాయక్, జాయింట్ సెక్రటరీగా బనోత్ రామ్ కోటినాయక్, తేజవత్ రాజునాయక్, రామావత్ ధశరథ్‌నాయక్, డిప్యూటీ సెక్రటరీగా రవినాయక్, సభ్యులుగా బాలాజీనాయక్, సావత్ రూప్‌సింగ్‌నాయక్, కోటినాయక్, రాములునాయక్, నాగేష్‌నాయక్, భీమానాయక్, రవితేజనాయక్, మంగూలాల్‌నాయక్, ధనుంజయ్ నాయక్‌లను నియమించారు.

పిల్లలకు బైక్‌లు ఇవ్వొద్దు

మేడ్చల్: పట్టణ పరిధిలో మైనర్ డ్రైవింగ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దని ఆయన కోరారు. మైనర్ల డ్రైవింగ్‌తో ఇతరులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తాము కఠినంగా వ్యవహరిస్తున్నా ఏదో ఒక ప్రాంతంలో మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. కేసులు నమోదు చేసి చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.



ఘట్‌కేసర్ జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో చెత్తా చెదారం



ఘట్‌కేసర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దుస్థితి

సాక్షి ఫోకస్

ఇవి స్కూళ్లేనా..?

సమస్యల వలయంలో ప్రభుత్వ స్కూళ్లు

- స్కూళ్లు ప్రారంభమైనా వెక్కిరిస్తున్న సమస్యలు
- సరిపడా గదులు లేక వరాండాల్లోనే చదువులు
- తాగునీటి సౌకర్యం లేక ఇంటి నుంచే నీరు
- ప్రతిరోజూ విద్యార్థులకు తప్పని అవస్థలు
- నిర్లక్ష్యం వీడని విద్యాశాఖ అధికారులు
- అటువైపు కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులు



మేడ్చల్‌లో మధ్యాహ్న భోజనం చూపిస్తున్న విద్యార్థి



రామంతాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గంలో చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలు సమస్యల వలయంలో చిక్కుకొని విలవిల్లాడుతున్నాయి. నియోజకవర్గంలోని మండలాలు, మున్సిపాలిటీల్లో 145 ప్రాథమిక పాఠశాలలు, 59 ఉన్నత పాఠశాలలు ఉండగా కొన్ని పాఠశాలల్లో అదనపు గదుల అవసరం ఉంది. బోధనకు కావాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య లేకపోవడం, ఖాళీలు ఎక్కువగా ఉండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. చాలా వరకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మూత్రశాలలు ఏర్పాటు చేసినా వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని పాఠశాలలో ఫర్నిచర్ కొరత కనిపిస్తోంది. స్కూళ్ల మొదలైనా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

రామంతాపూర్ హైస్కూల్లో టీచర్ల కొరత

రామంతాపూర్: రామంతాపూర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 6 నుంచి 10వ తరగతి వరకు ఉంది. ఈ పాఠశాలలో ఇంగ్లిష్, తెలుగు మీడియం విద్యార్థుల సంఖ్య 800. ఒక్కో తరగతిని మూడు సెక్షన్లకు విభజించారు. అయితే ఈ పాఠశాలలో ఇంగ్లిష్, తెలుగు, హిందీ టీచర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. రామంతాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఉంది. దాదాపు 300 మంది విద్యార్థులు ఉన్నా టీచర్ల కొరత ఉంది.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో దాదాపు 670 మంది విద్యార్థులు ఉన్నారు. సరిపడా ఉపాధ్యాయులు లేరు. తెలుగు, హిందీ, సోషల్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు అవసరం. మరుగుదొడ్లు, వంట గది ఉన్నప్పటికీ కంప్యూటర్ గది లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు అన్ని తరగతులకు పాఠ్య పుస్తకాలు సరిపడా రాలేదు.

ఘట్‌కేసర్‌లో..

మండలంలో 13 జెడ్పీ పాఠశాలలు, 18 ప్రాథమిక, 2 యూపీఎస్ స్కూళ్లు ఉన్నాయి. చాలా పాఠశాలల్లో మన ఊరు-మన బడి నిర్మాణాలు అందుబాటులోకి రాలేదు. తాగునీటి కొరత ఉంది. మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి. ఉన్న వాటిలో నీటి సదుపాయం లేదు. ఆవరణ చెత్త, వ్యర్థాలతో నిండి ఉంది. కొన్ని గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పోచారంలో ఫర్నీచర్ కొరత కనిపించింది.





కీసరదాయర ప్రైమరీ పాఠశాల్లో దుస్థితి



మల్లాపూర్ హైస్కూల్

వికలాంగులకు బస్‌పాస్‌ల అందజేత



ఘట్‌కేసర్: అవుషాపూర్‌లోని వికలాంగులకు ఇబ్బందులు రాకుండా ఆర్టీసీ బస్‌పాస్‌లను సర్పంచ్ కావేరి, మశ్చేందర్‌రెడ్డి దంపతులు సొంత నిధులతో రెన్యూవల్ చేయించారు. రెన్యూవల్ చేయించిన బస్‌పాస్‌లను వికలాంగులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వికలాంగులు సర్పంచ్ దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

పిల్లలకు బైక్‌లు ఇవ్వొద్దు



మేడ్చల్: పట్టణ పరిధిలో మైనర్ డ్రైవింగ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దని ఆయన కోరారు. మైనర్ల డ్రైవింగ్‌తో ఇతరులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. తాము కఠినంగా వ్యవహరిస్తున్నా ఏదో ఒక ప్రాంతంలో మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. కేసులు నమోదు చేసి చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

త్వరలో ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాగారంలోని శ్రీభవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానం తరఫున త్వరలో నోట్‌బుక్స్ పంపిణీ చేయనున్నట్లు ఆలయ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ త్వరలో మాధవానంద సరస్వతి స్వామిచేతుల మీదుగా విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేస్తామన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న సుమారు 2,300 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

భవిష్యత్ అంతా డిజిటల్ విద్యదే..

మల్లాపూర్: భవిష్యత్‌లో విద్యా విధానం అంతా డిజిటల్ క్లాస్‌రూమ్ ద్వారానే పాఠాలు బోధిస్తారని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మల్కా కొమురయ్య అన్నారు. బుధవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సీబీఎస్సీ నేతృత్వంలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరాసీ(ఎఫ్ ఎల్ఎన్) జీ-20 ప్రెసిడెన్సీ నూతన విద్యా విధానంపై సదస్సు నిర్వహించారు. పలువురు విద్యావేత్తలు పాల్గొని పలు కీలక విద్యా విధానంపై పలు సూచనలు, అనుభవాలను పంచుకున్నారు. అనంతరం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వీసీ జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో లావాదేవిలు డిజిటలైజ్ అవుతాయని, ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం నిలవనుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఓయూ రిటైర్డ్ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెడ్ సుమితా రాయ్, తెలంగాణ ప్రభుత్వ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ శాంత, దిశా దోషి, సీతా కిరణ్, డాక్టర్ స్కంద్ బాలి, ప్రముఖ విద్యా వేత్త శరత్‌చంద్ర, అంబి సుబ్రహ్మణ్యం, పాఠశాల సీవోవో మల్కా యశ్వసి, ప్రిన్సిపాల్ సునీతా రావు, 50 మంది ప్రధానోపాధ్యాయులు, 234 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యావేత్తలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు, పలకల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మట్లాడుతూ.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఇంగ్లిష్‌లో బోధన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నెల్సన్, జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు శివకుమార్, సునంద, యాదయ్య, కరుణ, శాంతి, సత్యకళ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు 'డబుల్' ఇళ్లు కలే..

కాంగ్రెస్ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కలగానే మిగిలిపోయిందని కాంగ్రెస్ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. బుధవారం మల్కాజిగిరి చౌరస్తాలో ఒక రోజు నిరాహార దీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారన్నారు. 9 సంవత్సరాల్లో సుమారు 20 వేలకు పైగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా వారికి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ హయాంలోనైనా రాజీవ్ గృహకల్ప ఇళ్లు వచ్చాయన్నారు. స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల గురించి ఎన్నడూ మాట్లాడకపోవడం వారి వైఫల్యానికి నిదర్శనం అన్నారు. పేదలకు డబుల్ ఇళ్లు కేటాయించే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వినోద్‌యాదవ్, గుత్తి చందర్, సానాది శంకర్, మహ్మద్ అలీ, జీడీ సత్యనారాయణ గౌడ్, ఉమేష్‌సింగ్, సిరిగిరి నర్సింగరావు, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నందికంటి శ్రీధర్

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో కార్పొరేటర్ దీటుగా వైద్యం

మంత్రి చామకూర మల్లారెడ్డి

మల్లాపూర్: నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో కార్పొరేట్ తలదన్నేలా వైద్యులు మెరుగైనా వైద్యం అందిస్తున్నారని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నూతన వైద్య పరికరాలను నూతన ఆపరేషన్ థియేటర్, ల్యాబ్‌రూమ్‌లను స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తర్వాత పేదలకు మెరుగైన వైద్యం అందుతోందన్నారు. కార్యక్రమంలో ఈఎస్‌ఐ సూపరింటెండెంట్ డాక్టర్ కమల, ఈఎస్‌ఐ బోర్డు కమిటీ సభ్యులు వేముల మారయ్య తదితరులు పాల్గొన్నారు.



నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రిలో వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వం ధ్యేయం

రామంతాపూర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ తీసుకొని ఎన్నో ప్రభుత్వ వైద్యశాలలను ప్రారంభించి ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా పనిచేస్తోందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. బుధవారం రామంతాపూర్‌లోని జీహెచ్‌ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో నారాయణరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమాదేవి, ప్రకాష్, బీఆర్‌ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



రామంతాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కంకర రోడ్డుపై కష్టాలు

కాప్రా: కాలనీలో కంకర రోడ్డుపై నడవలేక కాప్రా డివిజన్ ప్రశాంత్‌నగర్ వాసులు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. కాలనీకి మార్చి నెలలో సీసీ రోడ్డు మంజూరు కాగా.. ఏప్రిల్‌లో పనులు ప్రారంభించారు. కానీ ఆ పనులు మాత్రం నేటికీ అసంపూర్తిగా వదిలేయడంతో కంకర రోడ్డుపై స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇష్టానుసారంగా తవ్వి వదిలేయడంతో ఇళ్ల వద్దకు తమ వాహనాలు కూడా తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందని స్థానిక కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో.. ఓపిక నశించి మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిశారు. సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో కాలనీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండిపడ్డారు. తక్షణమే అసంపూర్తిగా వదిలేసిన పనులను తిరిగి ప్రారంభించి సమస్య పరిష్కరించకుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ప్రశాంత్‌నగర్ కాలనీవాసుల సమస్యలపై స్పందించిన ఈఈ హరిలాల్ త్వరలోనే పనులు ప్రారంభించి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. పనుల విషయంలో ఇప్పటికే సదరు కాంట్రాక్టర్‌కు రెండుసార్లు నోటీసులు జారీ చేశామని, ఇప్పటికే పనులు ప్రారంభించకపోతే ఉన్నతాధికారుల ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జియో కెమిస్ట్రీ సాయంతో ఫ్లోరైడ్ కాలుష్య మూలాన్ని గుర్తించవచ్చు



ఉప్పల్ ఎన్‌జీఆర్‌ఐలో శిక్షణను ప్రారంభిస్తున్న డైరెక్టర్ ప్రకాశ్‌కుమార్, ప్రొ సాయిబల్‌గుప్తా

ఉప్పల్: ఫ్లోరైడ్ కాలుష్య మూలాన్ని గుర్తించడానికి జియో కెమిస్ట్రీ ఎంతగానో ఉపయోగపడుతుందని ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొ సాయిబల్ గుప్తా సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్ సహకారంతో ఉప్పల్‌లోని నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఎన్‌జీఆర్‌ఐ)లో బుధవారం నిర్వహించిన అడ్వాన్స్ ఇన్‌స్ట్రూమెంటేషన్ ఫర్ ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌పై వారం పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక సమస్యల పరిష్కారానికి సమగ్ర అధ్యయనాలు అవసరమని అన్నారు. ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్ మాట్లాడుతూ సంస్థలో అందుబాటులో ఉన్న ప్రయోగశాలలో మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డా.ఎం.రామ్‌మోహన్, స్కిల్స్ కో- ఆర్డినేటర్ డా.అభిరామ్ బన్సాల్, వరంగల్ టెక్నికల్ ఆఫీసర్ హరీష్ ముడుపు, డా.డి.శ్రీనివాస శర్మ, ఎం.సత్యనారాయణన్, కేశవ్‌కృష్ణ, దేవేందర్ కుమార్, కె.రామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం నూతన భవనానికి భూమిపూజ

ఉప్పల్: ఉప్పల్ డివిజన్‌లోని న్యూవిజయపురి కాలనీలోని గంగపుత్ర సంఘం నూతన భవనానికి భూమిపూజ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి, గంగపుత్రుల సంఘం ప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంగపుత్రులకు ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేసుకుంటున్నందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మందముల పరమేశ్వర్‌రెడ్డి, తవిడ బోయిన గిరిబాబు, కాలనీ సంఘం ప్రతినిధులు, గంగపుత్ర సంఘం నేతలు పాల్గొన్నారు.



గంగపుత్ర సంఘం భవనానికి భూమిపూజ చేస్తున్న రజిత పరమేశ్వర్‌రెడ్డి